రాంపూర్ డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధంగా ఉంచాలి

■ గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ■ నర్సరీ, స్మార్ట్‌సిటీ పనుల తనిఖీ

వరంగల్, జూన్ 18: వన మహోత్సవ లక్ష్యానికి తగ్గట్లుగా మొక్కలను సిద్ధంగా ఉంచాలని గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం గ్రేటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలు, డంపింగ్ యార్డు, కుక్కలకు శస్త్ర చికిత్స సెంటర్, స్మార్ట్‌సిటీ పనుల నాణ్యతను పరిశీలించారు. హోమ్ స్టేట్ మొక్కల పంపిణీలో భాగంగా ప్రతి ఇంటికి ఒక పూల మొక్క అందజేయాలన్నారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న సెంట్రల్ మీడియాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కుక్కల శస్త్రచికిత్స కేంద్రంలో రోజూ ఎన్ని కుక్కలకు ఆపరేషన్లు చేస్తున్నారనే వివరాలు తెలుసుకున్నారు. రాంపూర్‌లోని డంపింగ్ యార్డులో జరుగుతున్న బయో మైనింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ రవికుమార్, సంతోష్‌బాబు, ఎంహెచ్‌వో రాజేశ్, హార్టికల్చర్ అధికారి రమేశ్, వెటర్నరీ డాక్టర్ గోపాల్‌రావు పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నిర్దిష్ట గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 66 డివిజన్లలో చేపట్టిన పనులు, వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో ఎక్కువ మురికివాడలు ఉన్న 40వ డివిజన్ సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌ను కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. కార్పొరేషన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డివిజన్ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్ డివిజన్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు.

సీపీని కలిసిన మున్సిపల్ కమిషనర్

సుబేదారి: కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని సీపీ కార్యాలయంలో కలిసి పూల మొక్క అందజేశారు.

పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలి

■ స్కూళ్లలో కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలి
■ విద్యార్థుల ఆరోగ్యంపై టీచర్లు దృష్టి పెట్టాలి
■ సర్కారు బడులను సందర్శించిన కలెక్టర్

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

కరీమాబాద్, జూన్ 18: పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో కలెక్టర్ సత్యశారద బుధవారం ఖిలావరంగల్ మండల పరిధిలోని ఖిలావరంగల్, కరీమాబాద్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. హాజరు పట్టికలు, రిజిస్టర్లు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి తగిన విధంగా బోధించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన సామూహిక అక్షరాభ్యాసంలో సత్యవతి పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మరుపల్ల రవి, భైరబోయిన ఉమ, డీఈవో జ్ఞానేశ్వర్, ఎంఈవో ప్రసాద్, హెచ్ఎం మాధవి, నాయకుడు అక్తర్ పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

ఖిలావరంగల్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో టాస్క్‌ఫోర్స్, యోగా దినోత్సవంపై వేర్వేరుగా సమీక్షించారు. పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్‌పై దృష్టి సారించాలన్నారు. ఇటుక బట్టీలు, బీడీల తయారీ, చిన్న తరహా పరిశ్రమలు, దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి బాలకార్మికులను గుర్తించాలన్నారు. హార్వెస్టింగ్ పనుల్లో తనిఖీలు చేయాలన్నారు. పిల్లలను పనుల్లో పెట్టుకుంటే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో చైల్డ్ లేబర్ విజిలెన్స్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే, ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ ఓసిటీ స్టేడియంలో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ నారాయణస్వామి, డీఆర్డీవో కౌసల్యాదేవి, డీఈవో జ్ఞానేశ్వర్, డీవైఎస్‌వో సత్యవాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్ పాల్గొన్నారు.

సాంబయ్యకు నివాళులర్పిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

మృతుల కుటుంబాలకు పెద్ది పరామర్శ

నర్సంపేట, జూన్18: పట్టణంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను బుధవారం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన 8వ వార్డుకు చెందిన వేల్పుల సాంబయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. శాంతినగర్ 7వ వార్డుకు చెందిన గద్దల కొమురయ్య కుటుంబాన్ని పెద్ది పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెళ్లి వెంకటనారాయణగౌడ్, ప్రచార కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ మండల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు బండి ప్రవీణ్, పెండెం వెంకటేశ్వర్లు, గందె చంద్రమౌళి, నాయకులు ఆకుల ప్రభాకర్, జన్ను సురేందర్, కందికొండ శ్రీను, బగ్గి రాజు, రాజేందర్ ఉన్నారు.

నేడు టీటీడీ ఆధ్వర్యంలో యోగాసనాలు

పోచమ్మమైదాన్, జూన్ 18: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యోగాసనాలు నిర్వహించనున్నట్లు టీటీడీ కార్యక్రమ నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. హనుమకొండలోని టీటీడీ కల్యాణమండపం ఆవరణలో బుధవారం యోగా గురువు పోశాల శ్రీనివాస్ వేణుశర్మ, సంస్కృత అధ్యాపకురాలు శ్రీవిద్య ప్రచార బ్యానర్ ఆవిష్కరించారు. హనుమకొండ జిల్లా నక్కలగుట్టలోని విద్యారణ్య జూనియర్ కళాశాల, వరంగల్ జిల్లాలో వరంగల్ పిన్నవారివీధిలోని శారద ఉన్నత పాఠశాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కస్తూర్బాగాంధీ ఉన్నత పాఠశాల, ములుగు జిల్లాకేంద్రంలోని అరవింద ఉన్నత పాఠశాల, మహబూబాబాద్ జిల్లాలోని గార్ల విశ్వశాంతి ఉన్నత పాఠశాల, జనగామ జిల్లాలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

నర్సంపేట: ఈ నెల 20న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. నర్సంపేట వాకర్స్ అసోసియేషన్, జిల్లా యువజన క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో పట్టణంలోని వల్లభ్‌నగర్ మినీ స్టేడియంలో శుక్రవారం ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలి

■ నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి ■ అదనపు డీసీపీ ప్రభాకర్‌రావు

మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న డీసీపీ

వరంగల్‌చౌరస్తా, జూన్ 18: వరంగల్ నగరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని, నిబంధనలను అమలు చేయాలని లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ పోలీసులకు సూచించారు. నగరంలోని ఎంజీఎం, పోచమ్మమైదాన్, వరంగల్‌చౌరస్తా, హెడ్‌పోస్టాఫీస్ సెంటర్ కూడళ్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులకు సూచనలు చేశారు. ఎంజీఎం హాస్పిటల్ సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్‌కు అడ్డుగా ఉన్న పురాతన సిగ్నల్ పోల్స్‌ను తొలగించాలని, పోచమ్మమైదాన్ సెంటర్‌లో దేశాయిపేటకు, వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో వరంగల్ చౌరస్తా వైపు ఫ్రీ లెఫ్ట్ దారిని మెరుగుపరుస్తూ కోన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వరంగల్ చౌరస్తాలో రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్ సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. విధుల్లో సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని, ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. నగరంలోని ప్రధాన రహదారులు చిరువ్యాపారులతో అక్రమణకు గురికాకుండా, ఫుట్‌పాత్‌పై ఎలాంటి నిర్మాణాలు జరపకుండా నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

భద్రకాళి అమ్మవారికి బోనాలు

వరంగల్, జూన్ 18: భద్రకాళి అమ్మవారికి బోనాలు చేసే కొత్త సంప్రదాయానికి దేవాదాయ శాఖ శ్రీకారం చుట్టింది. ఈ నెల 22న మంత్రి కొండా సురేఖ భద్రకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించనున్నారు. ఆలయ ఆవరణలో ఈవో శేషుభారతి, ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు బంగారు బోనం బ్యానర్ ఆవిష్కరించారు. కాగా, భద్రకాళి ఆలయంలో బోనాల పండుగ పేరుతో కొత్త సంప్రదాయానికి తెర లేపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నారు. కొత్త పద్ధతితో ఆలయ ప్రాసస్త్యంపై ప్రభావం చూపుతుందంటున్నారు.

వరంగల్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

సుబేదారి, జూన్ 18: వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్స్ కంట్రోల్ విభాగ పోలీసులు జాగిలాలతో బుధవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల బ్యాగులను పరిశీలించారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సతీశ్, ఆర్ఐ శివకేశవులు, ఆర్ఎస్సైలు మనోజ్, నాగరాజు పాల్గొన్నారు.

శిక్షణ కోసం ట్రైనింగ్ సంస్థల నుంచి దరఖాస్తులు

ఏటూరునాగారం, జూన్ 18: ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని డిగ్రీ పాసైన గిరిజన అభ్యర్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల ఎంపిక కోసం గ్రూప్స్, పోలీస్, బ్యాంకింగ్, రైల్వే, ఎస్ఎస్సీ, ఇతర ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చే సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా తెలిపారు. అనుభవం కలిగిన సంస్థల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9849736850 నంబర్‌లో సంప్రదించాలని కోరారు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : సీఐ

నర్సంపేట, జూన్18: అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని నర్సంపేట టౌన్ సీఐ రఘుపతిరెడ్డి కోరారు. చంద్రయ్యపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ సారా తయారీ, అమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరస్తులను త్వరగా గుర్తించొచ్చన్నారు.

భూ కబ్జా ఆరోపణలపై విచారణ

పర్వతగిరి, జూన్ 18: మండలంలోని కల్లెడలో గౌడ సంఘానికి చెందిన 4.01 ఎకరాల భూమి కబ్జాకు గురైందని కలెక్టరేట్‌లో సోమవారం స్థానికులు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం వరంగల్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మురళీధర్ ఆధ్వర్యంలో గ్రామంలో విచారణ చేపట్టారు. తమ భూమి కబ్జాకు గురికాలేదని, 2019లోనే సంఘం అవసరార్థం అమ్ముకున్నామని సభ్యులు రాతపూర్వకంగా తెలియజేశారు. సభ్యుల నుంచి వాంగ్మూలం తీసుకున్న అధికారులు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

దుగ్గొండి, జూన్ 18: మండల ప్రజలు దూర ప్రయాణాలు, తీర్థయాత్రలకు వెళ్లేటప్పుడు ఇంట్లో విలువైన వస్తువులు, ఆభరణాలను భద్రపర్చుకోవాలని ఎస్సై రావుల రణధీర్ సూచించారు. ఇండ్లకు సెంట్రల్ లాకింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని, లేనిపక్షంలో ఇంటి వద్ద కుటుంబ సభ్యులెవరైనా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనలో సర్కారు విఫలం

గిర్మాజీపేట, జూన్ 18: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు ఎద్దేవా చేశారు. సంఘం నేతలతో కలిసి బుధవారం ఆయన ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ జ్యోతికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ప్రమాదవశాత్తు కల్లు మండవ దగ్ధం

నర్సంపేట, జూన్18: సర్వాపురం శివారు నర్సంపేట-కొత్తగూడ ప్రధాన రహదారిలో బుధవారం సాయంత్రం కల్లు మండవ దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. గీత కార్మికులు రూ. 15 వేలు వెచ్చించి కల్లు మండవ ఏర్పా టు చేసుకున్నారు. మండవ సమీపంలో ఓ రైతు కొయ్య కాళ్లకు నిప్పు పెట్టడంతో ప్రమాదవశాత్తు రవ్వలు ఎగిరొచ్చి మండవపై పడడంతో మంటలు వ్యాపించి కాలిపోయింది.

ధర్మారంలో ఒకరి ఆత్మహత్య

గీసుగొండ, జూన్ 18: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం శివారులోని గంగుల కట్టయ్య వ్యవసాయ బావి వద్ద గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసున్నట్లు ఎస్సై ప్రశాంత్‌బాబు తెలిపారు. వివరాలకు ఎంజీఎంహెచ్‌లో సంప్రదించాలని సూచించారు.

'యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలి'

నర్సంపేట, జూన్ 18: సీఎం రేవంత్‌రెడ్డి యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం డిమాండ్ చేశారు. బుధవారం నర్సంపేట మాదన్నపేటరోడ్డులోని యాదవ సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ నెల 30న నిర్వహించనున్న యాదవుల ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

గిర్మాజీపేట, జూన్ 18: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఒకటి, 5వ తరగతిలో బెస్ట్ అవైలబుల్ స్కీంలో దరఖాస్తుల గడువును ఈ నెల 22 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పీ భాగ్యలక్ష్మి తెలిపారు. వివరాలకు 9550078045, 7396503448, 7337585866, 7396503448 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లారీ ఓనర్ ఆత్మహత్యయత్నం

కాశీబుగ్గ, జూన్ 18: లారీ అసోసియేషన్ సభ్యుడు, లారీ ఓనర్ కొత్త వాడకు చెందిన ఇద్దునూరి రాజేంద్రప్రసాద్ బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎనుమాముల ఎస్సై మిరిపెల్లి రాజు తెలిపారు. వెంటనే అతడిని ఎంజీఎం దవాఖానకు తరలించారు. అసోసియేషన్ నిర్వాహకుల వేధింపులు తట్టుకోలేక రాజేంద్ర ప్రసాద్ పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

'తూర్పు' పోలీసులకు చార్జి మెమోలు జారీ

సుబేదారి, జూన్ 18: ప్రొటోకాల్ లేని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుకు ఇటీవల ఎస్కార్ట్‌గా వెళ్లిన వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, మిల్స్‌కాలనీ, ఇంతెజార్‌గంజ్, మట్టివాడ, వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలపై క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు సీపీ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం చార్జి మోమెలు జారీ చేశారు. సదరు ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. సంతృప్తి చెందని సీపీ శాఖాపరమైన చర్యలు చేపట్టారు.

కవితాప్రసాద్ సేవలు మరువలేనివి

చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వీసీ సూర్య ధనుంజయ

రాళ్లబండి కవితా ప్రసాద్ రాసిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ధనుంజయ, రాజేందర్

పోచమ్మమైదాన్, జూన్ 18: దివంగత రాళ్ల బండి కవితా ప్రసాద్ సాహితీప్రియుడిగా సాహిత్యలోకానికి అందించిన సేవలు మరువలేనివని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సూర్య ధనుంజయ అన్నారు. సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, ప్రసిద్ధ శతావధాని, దివంగత డాక్టర్ రాళ్లబండి కవితా ప్రసాద్ స్మారకార్థం సహృదయానుబంధ పురస్కార సభను హనుమకొండ వడ్డేపల్లిలోని పీఆర్ గార్డెన్‌లో బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా జి.గిరిజా మనోహర్ బాబు అధ్యక్ష తన జరిగిన సభలో పురస్కార స్వీకర్త డాక్టర్ మంగారి రాజేందర్, డాక్టర్ ఏవీ నరసింహారావు, లక్ష్మీకాంతారావు, రాళ్లబండి నాగినీదేవి, సంవరణ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రాళ్లబండి కవితాప్రసాద్ సాహితీరంగానికి చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఆమె ఆశువుగా రాసిన అనేక పద్యాలు, ఓరుగల్లు భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఆశువుగా రాసిన శతకం అందరి ప్రశంసలు అందుకుందని కొనియాడారు. ఈ సందర్భంగా సహృదయానుబంధ పురస్కారాన్ని రిటైర్డ్ ఏపీ జ్యుడీషియల్, అకాడమీ హైదరాబాద్ డైరెక్టర్ మంగారి రాజేందర్‌కు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జాతీయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మావుడూరు సూర్యనారాయణమూర్తి, ప్రముఖ కవి అంపశయ్య నవీన్, జూలూరు నాగరాజు, సీత వెంకట్, ఏవీ నరసింహారావు, కళా రాజేశ్వర్‌రావు, ప్రముఖ సాహితీవేత్తలు, న్యాయవాదులు ఏరుకొండ జయశంకర్, మంగినపల్లి సదాశివుడు, నరహరిశర్మ, కవులు, కళాకారులు పాల్గొన్నారు. ఈ సభలో రాళ్లబండి కవితా ప్రసాద్ గతంలో రాసిన కవిత వనం, సప్తగిరి ధామ కలియుగ సార్వభౌమ పుస్తకాలను పునఃముద్రణ చేసి అతిథుల సమక్షంలో అతడి కుమారుడు సంవరణ్, నాగినీదేవి ఆవిష్కరించారు.

వృద్ధులకు ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

వృద్ధ దంపతులకు ఆపన్నహస్తం

నల్లబెల్లి, జూన్ 18: తామున్నామంటూ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు వృద్ధ దంపతులకు ఆపన్నహస్తం అందించారు. ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో 'వృద్ధ దంపతులకు ఆపద' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి, పంతులుపల్లె ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం కర్ణకంటి రామ్మూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం మండలంలోని రాంపూర్ గ్రామానికి చేరుకొని ఊరు చివరన గుడిసెలో నివసిస్తున్న మేకల రాములు-కనకమ్మ దంపతులను కలిశారు. ఈ సందర్భంగా వారికి రూ. 10 వేల నగదుతోపాటు దుస్తులు, రూ. 2500 విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు. అదేవిధంగా వర్షాకాలం ప్రారంభం కావడంతో వారు నివసిస్తున్న పూరి గుడిసె తడవకుండా టార్పాలిన్ కొనుగోలు చేసి గుడిసెపై కప్పారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులకు వృద్ధ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి ఉడుత రాజేందర్, ఉపాధ్యాయులు కూన మల్ల రాజన్‌బాబు, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, గోనెల సాంబయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలి

నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

రాయపర్తి, జూన్ 18: మండలంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగుర వేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, పూస మధు, కర్ర రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కాట్రపల్లి, కొండూరులో స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ పదేండ్లలో చేసిన సమగ్రాభివృద్ధిని వివరించాలని కోరారు. సమావేశాల్లో మండల నాయకులు మండల శ్రీధర్, దేశబోయిన ఉపేందర్, బోనగిరి ఎల్లయ్య, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, బద్దం వేణుగోపాల్‌రెడ్డి, ఆశ్రఫ్ పాషా, సంకినేని ఎల్లస్వామి, చందు సతీశ్, ఉబ్బని సింహాద్రి, మహ్మద్ అన్వర్, జయశ్రీ, కత్తి యాకయ్య, గుమ్మడిరాజుల శ్రీనివాస్, కత్తి సోమన్న, చెన్నబోయిన యాకయ్య, మహ్మద్ నాసర్, ఖలీల్, బూడిద శ్రీధర్, మొర్రి రాజేందర్, అశోక్, బూడిద సురేందర్, నేరెళ్ల మహేశ్, కొమ్ము రాజు, సత్యనారాయణరావు, పులి సోమయ్య, రాములు పాల్గొన్నారు.

తప్పు చేసిన పోలీసులను తప్పించాలి

వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

మాట్లాడుతున్న ప్రదీప్‌రావు

కాశీబుగ్గ, జూన్ 18: తప్పు చేసిన పోలీస్ అధికారులను తప్పించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు డిమాండ్ చేశారు. ఓసిటీలోని ఆయన తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఏ పదవి లేకున్నా మంత్రి భర్త హోదాలో కొండా మురళీధర్‌రావుకు ఏసీపీ తోపాటు సీఐలు, ఇతర పోలీసులు రక్షణ వలయంగా సేవలు అందించడం సరికాదన్నారు. ఇటీవల మురళీధర్‌రావు వరంగల్‌లో పలు అధికారిక కార్యక్రమాలతోపాటు వివాహ విందులకు వెళ్లినప్పుడు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తోపాటు మిల్స్‌కాలనీ, ఇంతెజార్‌గంజ్, మట్టివాడ సీఐలతోపాటు ఎస్సైలు ఎస్కార్ట్‌గా వెళ్లడాన్ని తాము ఖండిస్తున్నామని చెప్పారు. పోలీసుల పొరపాటును గుర్తించిన వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఏసీపీ నందిరాంనాయక్‌తోపాటు పోలీసులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని స్వాగతించారు. ఇంతటితో సరిపుచ్చకుండా తప్పు చేసిన వారిని విధుల నుంచి తప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎన్‌హెచ్ఎం సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

సంగీతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యూనియన్ నాయకులు

వరంగల్‌చౌరస్తా, జూన్ 18: నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్‌ఖన్నా ప్రభుత్వాన్ని కోరారు. ఎన్‌హెచ్ఎం డైరెక్టర్ సంగీతను బుధవారం యూనియన్ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ వేతనానికి సరిసమానంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అందించాలని కోరారు. 510 జీవో వల్ల సుమారు 4 వేల మందికి అన్యాయం జరిగిందని, వారందరికీ న్యాయం జరిగేలా చూడాలని, పెండింగ్ పీఆర్సీలను విడుదల చేయాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని సంగీత హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ అధ్యక్షుడు సారంగుల బాలసుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి గంగరబోయిన జ్యోతి, ఫిజియోథెరపిస్ట్ జైశీల, ఆయుష్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నాగార్జున ఉన్నారు.

ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని